# అన్నం పెట్టే బీఆర్‌ఎస్సా..? సున్నం పెట్టే కాంగ్రెస్సా..?

- ఎవరూ కావాలో ఆలోచించండి
- పనిచేసే వాళ్లను ఆదరించండి
- సీఎం కేసీఆర్‌తోనే ప్రజాసంక్షేమం
- కాంగ్రెసోళ్లు కరెంటు ఇవ్వరు.. రైతు బంధు బంద్ చేస్తరు
- వాళ్లను నమ్మితే మునుగుడే
- బీఆర్‌ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- గంగాధర మండలంలో ఎన్నికల ప్రచారం



గట్టుభూత్కూర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 27: తెలంగాణ ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకునే కేసీఆర్ కావాలో.. అబద్ధపు హామీలతో సున్నం పెట్టే కాంగ్రెస్, బీజేపీ కావాలో..? మీరే ఆలోచించాలని ప్రజలకు బీఆర్‌ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. పనిచేసే వాళ్లను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే 24 గంటల కరెంటు ఇవ్వరని, రైతు బంధును బంద్ చేస్తారని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం కేసీఆర్‌ను మరిచిపోవద్దని సూచించారు. చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గంగాధర మండలం హిమ్మత్‌నగర్, గట్టుభూత్కూర్, చిన్నఆచంపల్లి, ఆచంపల్లి, వెంకంపల్లి, కాసారం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసి అరిగోస పడుతున్నామని కర్ణాటక రాష్ట్ర రైతులు 200 మంది కొడంగల్, గద్వాల నియోజకవర్గాల్లో నిరసన తెలుపుతూ, ప్రజలకు వివరిస్తున్నారని పేర్కొన్నారు. జన్‌ధన్ ఖాతా కోలో హమ్ ధన్‌ధన్ పంద్రా లాక్ దాలేంగే అన్న ప్రధాని మోదీ 15 పైసలు కూడా జమచేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీది కుర్చీలాట అని, బీజేపీది మత రాజకీయమని, బీఆర్‌ఎస్‌ది ప్రజా సంక్షేమమని పేర్కొన్నారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. రూ. 1800 కోట్లతో చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేసి తీరుతారని, మాట ఇచ్చి మడమ తిప్పని మహా నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఎన్నికలు ముగిసిన వెంటనే అర్హులందరికీ గృహలక్ష్మి, బీసీ బంధు అందజేస్తామన్నారు. రైతు బీమా మాదిరిగా ప్రతి కుటుంబానికీ మేలు చేసేలా రూ.5 లక్షల బీమా వర్తించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి తీసుకురాలేదన్నారు, ఎన్నికల సమయంలో వచ్చి అసత్యపు ప్రచారం చేసే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరాం మధుకర్, జడ్పీటీసీ పుల్కం అనురాధ-నర్సయ్య, సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, వెలిచాల తిర్మల్‌రావు, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, వైస్ ఎంపీపీ కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, కొంకటి శంకర్, దోర్నాల హన్మంతరెడ్డి, మాల చంద్రయ్య, వేముల దామోదర్, ఎంపీటీసీ కోలపురం లక్ష్మణ్, నాయకులు ఆకుల మధుసూదన్, రామిడి సురేందర్, రేండ్ల శ్రీనివాస్, తడిగొప్పుల రమేశ్, నిమ్మనవేని ప్రభాకర్, కడపల మల్లేశం, సముద్రాల అజయ్, సుంకె అనిల్, మామిడిపెల్లి అఖిల్, ఇరుగురాల రవి, గంగాధర శ్రీకాంత్, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నాచంపల్లిలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

## సెల్ఫీ ప్లీజ్

*గంగాధర మండలం కాసారం గ్రామంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో చిన్నారులు, మహిళలు తమతో సెల్ఫీ దిగాలని ఎమ్మెల్యేను కోరారు. వారి కోరిక మేరకు ఎమ్మెల్యే రవిశంకర్ వారితో సెల్ఫీ దిగి చిన్నారులను ఉత్సాహపరిచారు.*



కాసారం గ్రామంలో చిన్నారులు, గ్రామస్తులతో కలిసి సెల్ఫీ దిగుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

## మొక్క నాటిన వీర్ల వెంకటేశ్వరరావు దంపతులు

రామడుగు, అక్టోబర్ 27: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు-కవిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్యసభ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు రామడుగు మండలం వెలిచాల శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీర్ల వెంకటేశ్వరరావు-కవిత దంపతులు మాట్లాడుతూ, మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెళ్లిరోజు సందర్భంగా మొక్కలు నాటే అవకాశం కల్పించిన రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మొక్క నాటుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు-కవిత దంపతులు

## ప్రత్యేక పూజలు

రామడుగు, అక్టోబర్ 27: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు-కవిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు ఆరపెల్లి ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వీర్ల వెంకటేశ్వరరావును కలిసి పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లంక మల్లేశం, తదితరులున్నారు.

## సుంకె రవిశంకర్ సతీమణి ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన

గంగాధర, అక్టోబర్ 27: మండలంలోని బూరుగుపల్లి, గంగాధర, ఇస్లాంపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, ఓటు అభ్యర్థించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రవిశంకర్ చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికాంత్

కొడిమ్యాల, అక్టోబర్ 27: మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రవికాంత్ శుక్రవారం సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వృద్ధులు, దివ్యాంగులు మొత్తం 2145 మంది ఉన్నారని చెప్పారు. ఎవరైనా ఓటు వేయలేని పరిస్థితుల్లో ఉంటే ముందుగా బ్యాలెట్ బాక్సుల్లో ఓటు వేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. దీని కోసం ఫామ్ 12డీ నింపాలన్నారు. ఎంపీడీవో పద్మజరాణి, సెక్టోరియల్ అధికారులు ఏవో జ్యోతి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చంద్రశేఖర్, మణిదీప్, సీడీపీవోలు కస్తూరి, నర్సింగరాణి, తదితరులున్నారు.



సమావేశానికి హాజరైన బీఎల్‌వోలు

## యోగా పోటీలు ప్రారంభం

కొత్తపల్లి, అక్టోబర్ 27: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ ప్రారంభించారు. అండర్-14, 17, 19 ఏళ్ల విభాగంలో నిర్వహించిన యోగా పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 225 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ సమ్మయ్య, ఎస్ రమేశ్, రాజబాబు, హన్మంతు, స్నేహలత, లక్ష్మణ్, కిష్టయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు

కొత్తపల్లి, అక్టోబర్ 27: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 29న సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ బాలబాలికల జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి అనంతరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1-1-2011 తర్వాత జన్మించిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి

## రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

చొప్పదండి, అక్టోబర్ 27: కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని, రైతుబంధుపై వారి వక్రబుద్ధి బయటపడిందని చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, రామడుగు మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తుంటే, కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. రైతుబంధును నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ఎంతటి దారుణమో రైతాంగం అంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రైతులంతా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చొప్పదండి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, డైరెక్టర్లు ఏనుగు స్వామి రెడ్డి, దీటి మధు, ఆనంద్, భూమయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.